# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 18-02-2016**

ఎక్కువ మంది ఆధారపడి బతికే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి, రైతులకు మేలుచేసే పద్ధతులు తేవడానికి వ్యవసాయ శాఖ వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. బడ్జెట్ పై చేస్తున్న శాఖల వారీ సమీక్షలలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖపై చర్చించారు. మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ఆర్థిక శాఖ కార్యదర్శులు శివశంకర్, రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారధి, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సురేష్ చందు, హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఫిషరీస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కమిషనర్ ప్రియదర్శిని, సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి మురళి, డైరీ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి నిర్మల, సమాచార శాఖ కమిషనర్ నవీన్ మిట్ట ల్, వ్యవసాయ యూనివర్సిటీ ఇన్ ఛార్జ్ వి.సి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది మంది రైతులు ఆధారపడే వ్యవసాయ శాఖపై చాలా బాధ్యత వుందని, వ్యవసాయం కోసం భిన్న కోణాల్లో అధ్యయనం చేసి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. అధిక వర్షాలున్నప్పుడు ఒకరకంగా, వర్షాలు లేనప్పుడు మరోరకంగా వ్యూహం ఉండాలని సిఎం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యుత్ కోతలు, ఎరువుల కొరత లేకుండా చేశామని, ఇంకా వ్యవసాయ రంగానికి సంబంధించి చాలా చేయాల్సి వుందన్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచడానికి, కల్తీ విత్తనాల బెడద లేకుండా చూడాలని, వ్యవసాయ విస్తరణ పనులు బాగా జరగాలని, పురుగుల మందుల వాడకాన్ని నియంత్రించాలని, ఆగ్రానమిస్ట్ ల సంఖ్య పెరగాలని, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందాలని, క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు రైతులకు చెదోడు వాదోడుగా వుండాలని సూచించారు.

అంతర్జాతీయంగా, దేశీయంగా వస్తున్న మార్పులను గమనించి, అందుకు అనుగుణంగా డిమాండ్ కు తగినట్లు పంటలను సాగుచేసే విధంగా రైతులను సన్నద్ధపరచాలని సిఎం చెప్పారు. మార్కెట్ యార్డుల్లో సరుకు తడవకుండా, గిట్టుబాటు ధరలు వచ్చేలా మార్కెటింగ్ శాఖతో కలిసి పనిచేయాలన్నారు. వీటన్నింటి విషయంలో ఏమి చేయాలో అధ్యయనం చేసి సరైన విధానాలు తయారు చేయాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వారసత్వంగా వచ్చిన మూస పద్ధతిలోనే పోకుండా, లోపాలను గుర్తించి శాస్త్రీయ పద్ధతిలో, రైతులకు మేలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని వివరించారు.

రైతులంతా ఒకే పంట వేయడం వల్ల కూడా నష్టం జరుగుతున్నది. మార్కెట్ డిమాండ్ కు తగ్గట్లు పంటలు వేయాలన్నారు. పత్తి ఎగుమతులపై విధించే సుంకం కారణంగా భవిష్యత్తులో పత్తికి మంచి ధర రాకపోవచ్చని, ఈ నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలను సూచించాలన్నారు. తక్కువ పెట్టుబడి, గ్యారెంటీ మార్కెట్ వున్న మొక్కజొన్నను ప్రోత్సహించాలని, సోయాబీన్ కు బాగా డిమండ్ వున్న దృష్ట్యా, ఈ విషయంలో రైతులను చైతన్య పరిచి సోయాబీన్ సాగు పెంచాలని సిఎం చెప్పారు. రైతులను పత్తి పంట నుంచి వేరే పంటలకు మళ్లే విధంగా విస్తృత ప్రచారం చేయాలని, బాగా చర్చ జరగాలని సిఎం సూచించారు.

కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయశాఖకు తక్కువ నిధులు ఉన్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రాధాన్యాలను గమనించి, వాటి నుంచి నిధులు అధిక మొత్తంలో పొందేందుకు ప్రణాళిక వేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగాలని, గ్రీన్ హౌజ్ కల్టివేషన్, మైక్రో ఇరిగేషన్ పెరగాలని సూచించారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని, రైతులు ఏమి కోరుకుంటున్నారో తెలుసుకుని కార్యచరణ తయారు చేయాలన్నారు. రాష్ట్రానికి అవసరమయ్యే కూరగాయలన్నీ ఇక్కడే పండించాలని చెప్పారు. మొత్తం రాష్ట్రానికి ఎన్ని విత్తనాలు కావాలి? ప్రభుత్వ పరంగా ఎన్ని విత్తనాలు ఉత్పత్తి జరుగుతున్నది? తదితర అంశాలను అధ్యయనం చేసి, అవసరమైనన్ని విత్తనాలు ఉత్పత్తి చేసే విధానం రూపొందించాలన్నారు. పంటలకు వచ్చే చీడ, పీడలను కూడా గుర్తించి, ఫోటోలు తీసి ఫోన్లు, ఐప్యాడ్ ల ద్వారా పంపాలని, అగ్రానమిస్ట్ లు విరుగుడు సూచించాలని చెప్పారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎంత మేరకు గ్రీన్ హౌజ్ కల్టివేషన్ వుండాలనే విషయంలో అంచనా రూపొందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మిర్చి, పసుపు, అల్లం లాంటివి పండించడానికి అనువైన భూములున్నాయని, వాటిని గుర్తించి, రైతులను ప్రోత్సహించాలన్నారు. సోయాబీన్ రైతులకు కావాల్సినన్ని విత్తనాలు అందుబాటులో వుంచాలని సిఎం చెప్పారు. మొక్కజొన్నలో ఎక్కువ దిగుబడి వచ్చే వంగడాలు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని రైతులకు వివరించి, సాగుకు ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయశాఖ ఆదాయాన్నిచ్చే శాఖ కాదనే అభిప్రాయం వున్న నేపథ్యంలో గతంలో ప్రభుత్వాలు ఆ శాఖకు నిధులు ఎక్కువ ఇచ్చేవి కావన్నారు. కానీ ఎక్కువ మందిని బతికించేది వ్యవసాయమే కాబట్టి, ఈ శాఖకు చాలినన్ని నిధులివ్వాలని సూచించారు. గతంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తేవాలని సూచించారు.

వ్యవసాయ యూనివర్సిటీని బలోపేతం చేయాలని, విత్తనాలు ఉత్పత్తి చేయాలని, కొత్త వంగడాలు సృష్టించాలని, పరిశోధనలు విస్తృతంగా జరగాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ ఇచ్చే బాధ్యత యూనివర్సిటీ తీసుకోవాలని, వ్యవసాయాధికారులను ఆగ్రానమిస్టులుగా తీర్చిదిద్దాలని కోరారు. వ్యవసాయ శాఖ ఉద్యనవన శాఖ అధికారులు, వ్యవసాయ యూనివర్సటీల మధ్య కంప్యూటర్ ఆన్ లైన్ కమ్యూనికేషన్ ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులందరికీ ఐప్యాడ్ లు కొనియ్యాలని ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్రంలో అనేక విత్తన ఉత్పత్తి సంస్థలున్నాయని, చాలా విత్తనాలు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతున్నాయని, తెలంగాణ సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ వారితో సమన్వయం కుదుర్చుకోవాలని, తెలంగాణ రైతులకు అవసరమయ్యే విత్తనాలు తయారు చేయాలన్నారు. హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలో అవసరమయ్యే పాలు ఇక్కడే ఉత్పత్తి కావాలని, అవసరమయ్యే మాంసం వేరే రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. గొర్రెలు, మేకల పెంపకం పెరగాలన్నారు.

మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులు సిద్ధమవుతున్నాయని, నీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లు కూడా చాలా వున్నాయని, వాటిలో పెద్ద ఎత్తున చేపల పెంపకం చేపట్టాలని సిఎం చెప్పారు. చేపల విత్తనాల ఉత్పత్తిపై కూడా దృష్టి కేంద్రీకరించాలని అన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**